క్లుప్తంగా

హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి

కర్నూలు (అర్బన్): సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, కాస్మొటిక్ చార్జీలు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో నగరంలోని బీసీడీఎస్టీ, బాలుర హాస్టల్‌ను సందర్శించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి సి.అశోక్, కోశాధికారి వీరేష్, నాయకులు రాజశేఖర్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ప్రారంభం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో శుక్రవారం సాయంత్రం వర్ల స్కిన్ లేజర్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ప్రారంభమైంది. ఆధునిక, సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ కొన్ని చికిత్సలకు హైదరాబాదుకు వెళ్లాల్సి వస్తోందని, అలాంటి ఇబ్బంది లేకుండా తమ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో అతి తక్కువ ఫీజులతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ అనూష, డాక్టర్ సుజిత్ రెడ్డి, డాక్టర్ ఇ.విజయలక్ష్మి, డాక్టర్ ఇ.విశ్వనాథ్ రెడ్డి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కంట్రోల్ రూం నంబర్లను సంప్రదించండి

కర్నూలు (టౌన్): తాగునీటి కోసం కంట్రోల్ రూం నంబర్లను సంప్రదించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ప్రజలు తాగునీటి ట్యాంకర్ల కోసం సచివాలయ అడ్మిన్లను సంప్రదించాలని సూచించారు. అలాగే 94901 37006, 87902 70528 సెల్ నంబర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కోసిగి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఆర్యపాఠ్య పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా అజీమ్ తెలిపారు. ఈనెల 16వ తేదీ కర్నూలులో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థినులు ఎం. అమృత, బి.శారద, ఎం.సువార్త, అమృత, రాధిక, స్వాతి ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 10వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. విద్యార్థినులతో పాటు కృషి చేసిన పీఈటీ సుమంగళను అభినందించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



వడ్ల రాజు (ఫైల్)

దేవనకొండ: మండల కేంద్రం దేవనకొండకు చెందిన వడ్ల రాజు (42) కర్నూలు–పత్తికొండ రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా.. కనకదిన్నె సమీపంలో భారత్ పెట్రోల్ పంపు వద్దనున్న ఈద్గా వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుకు అడ్డుగా రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం

ఓర్వకల్లు: పాఠశాల విద్యార్థులకు నిర్వహించే క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని ఇన్‌చార్జి హెచ్‌ఎం మద్దిలేటి అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ, పాఠశాల విద్యలో భాగంగా ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు స్పోర్ట్స్‌కు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రగతి ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో క్రీడా పరికరాలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం పిల్లలతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు అనిత, హన్నాసైమన్, లలితకుమారి, కళావతి, రాజీవ్‌కుమారి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: హరి హర వీరమల్లు, సయ్యారా, ది ఫెంటాస్టిక్ ఫోర్ : ఫస్ట్ స్టెప్స్, మహావతార్ నరసింహ, జూనియర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : హరిహర వీరమల్లు, జూనియర్, మహావతార్ నరసింహ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సయ్యారా, హరిహర వీరమల్లు
శ్రీరామ : పోలీస్ వారి హెచ్చరిక
రాజ్ : హరిహర వీరమల్లు
భరత్ కాంప్లెక్స్ : వెంకీ (2004)
విజయ : తమ్ముడు
విక్టరీ : కుబేరా

లీకేజీలు పునరావృతం కాకుండా చర్యలు

- రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయడం విశేషం
- నగర మేయర్ బీవై రామయ్య వెల్లడి



లీకేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): సమస్య పెద్దదే. అయినా సకాలంలో స్పందించి రెండు రోజుల్లో మెయిన్ పైపులైన్ లీకేజీ సమస్యను పరిష్కరించారని నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. శుక్రవారం సంతోష్ నగర్ వద్ద లీకేజీ మరమ్మతు పనులను కార్పొరేటర్లతో కలిసి మేయర్ పరిశీలించారు.మేయర్ మాట్లాడుతూ.. మునగాలపాడు నుంచి అశోక్‌నగర్ హెడ్ వాటర్ వర్క్స్ వరకు ఉన్న 1200 ఎంఎం ప్రధాన పైపులైన్ 30 ఏళ్ల నాటిదన్నారు. మెయిన్ పైపులైన్ కావడంతో లీకేజీ వచ్చిందన్నారు. అయితే మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారన్నారు. హైదరాబాద్ నుంచి నిపుణులను పిలిపించి రాత్రింబవళ్లు పనులు చేయించారన్నారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించారన్నారు. మరోసారి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యను అర్థం చేసుకొని ప్రజలు సహకరించారని చెప్పారు. యథావిధిగా కర్నూలు ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు నగర పాలక సంస్థ చర్యలు తీసుకుందన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత రెడ్డి, విక్రమ సింహారెడ్డి, సాయి , మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో సాధన చేస్తే విజయం తథ్యం



ఫ్లోర్‌బాల్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): క్రీడల్లో పట్టుదలతో సాధన చేస్తే విజయం సొంతమవుతుందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లాస్థాయి ఫ్లోర్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నూతన క్రీడల ద్వారా అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడంలో తల్లిదండ్రులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా ఫ్లోర్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ నాయుడు మాట్లాడుతూ.. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న 18వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్పొరేటర్లు లక్ష్మీకాంత రెడ్డి, విక్రమ సింహారెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి డాక్టర్ రుద్రా రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



ఎస్వీ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న గోనెగండ్ల వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో ఇటీవల పదవులు దక్కిన వారితో పాటు గోనెగండ్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ జిల్లా అధ్యక్షుడిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను గ్రామ, మండల స్థాయిలో ప్రజల వద్దకు తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల మండల ఉపాధ్యక్షుడు పేట అల్లాబకాష్, ప్రధాన కార్యదర్శి కే.బి.లింగన్న, హెచ్.కైరవాడి శీను, నాగేష్ నాయుడు, రవికుమార్ నాయుడు, చాంద్‌బాషా, హుస్సేన్ పటేల్, వీరేష్, దావూద్ బాషా, గట్ల చాంద్, రామకృష్ణ, ముస్తఫా, పూజారి ఓటులయ్య, మునెప్ప, డీలర్ వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. కిడ్స్ వరల్డ్ పార్క్, షరాఫ్‌బజార్, కాంగ్రెస్ ఆఫీసు, వడ్డెగేరి, రోజా వీధి, ఎస్ఆర్ పేట ఏరియా, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

27న నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ సాయంత్రం 7 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో సాంఘిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్‌మియ్యా తెలిపారు. 7 గంటలకు షాద్‌నగర్ సంస్కార భారతి వారిచే సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య దర్శకత్వం వహించిన 'మాకు స్వాతంత్ర్యం కావాలి' లఘు నాటిక, రాత్రి 7.30 గంటలకు డి.మహేంద్ర దర్శకత్వం వహించిన 'వర్క్ ఫ్రం హోమ్' హాస్య నాటక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమ కన్వీనర్‌గా వి.రాముడు వ్యవహరిస్తారని తెలిపారు.

27న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 27న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న అంతర్ జిల్లా సీనియర్స్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 90309 00569 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్‌యూ వీసీని రీకాల్ చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావును రీకాల్ చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రాఘవేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 24వ తేదీన వర్సిటీ పాలక మండలి సమావేశాన్ని ఎందుకు గోప్యంగా జరిపారని ప్రశ్నించారు. వీసీ ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తూ ప్రొఫెసర్లు, ఉద్యోగులకు ఎలాంటి సమాచారం లేకుండా సమావేశం నిర్వహించడంలో ఆంతర్యమేంటన్నారు. వర్సిటీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. వీసీ నిర్ణయాలతో రోజుకో వివాదం ఉత్పన్నమై వర్సిటీలో అలజడులు చెలరేగుతున్నాయని పేర్కొన్నారు. వర్సిటీ అభివృద్ధికి పాటు పడేవారైతే ఎందుకు వర్సిటీ ఏడీ బిల్డింగ్‌ను మూయించి రహస్యంగా ఈసీ మీటింగ్ జరుపుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈసీ మీటింగ్‌లో చేసిన తీర్మానాలను గతంలో వర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టేవారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత వీసీ ఈసీ మీటింగ్ జరిపి రెండు రోజులవుతున్నా ఈసీ మీటింగ్ మినిట్స్ బహిర్గతం చేయలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. వర్సిటీని భ్రష్టు పట్టిస్తూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న వీసీని వెంటనే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆక్సిజన్ సరఫరాలో సమస్య రానీయొద్దు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆక్సిజన్ సరఫరాలో సమస్యలు రానీయొద్దని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో డైట్, ఆక్సిజన్ సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆక్సిజన్ స్టోరేజ్ కెపాసిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసుకుంటూ ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని డైట్ పరిసర ప్రాంతాలు ప్రతిరోజూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని డైట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ మల్లేశ్వరమ్మ, డైట్ కాంట్రాక్టర్ మురళీధర్‌రెడ్డి, ఆక్సిజన్ సిబ్బంది ఖలీద్ పాల్గొన్నారు.

గడియారం ఆసుపత్రి అభివృద్ధికి సహకారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి నగరంలోని గడియారం ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన శుక్రవారం ఉదయం గడియారం ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బంది, సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు వైద్యసేవలు అందించేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గడియారం ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమర్ ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

కల్లూరు : గర్భిణీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వామసముద్రం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని నోడల్ అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, చేపలు, మాంసము తగిన మోతాదులో తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు తప్ప మరే ఆహార పదార్థాలు ఇవ్వకూడదన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయని, శ్వాసకోస, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధులు నుంచి పిల్లలను రక్షిస్తాయన్నారు. అలాగే బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయన్నారు. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిస్సి గ్రేస్, ఆరోగ్య అధికారి విజయ్‌కుమార్, సామాజిక ఆరోగ్య అధికారి మాబున్ని, ఆరోగ్య కార్యకర్త నాగమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పత్తికొండ: పట్టణానికి చెందిన ఇమాంవలి (23) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక 16వ వార్డుకు చెందిన చిన్నయ్య, గోకారమ్మ దంపతుల రెండో కుమారుడు ఇమాంవలి బేల్దారి పని చేస్తుంటాడు. అయితే.. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. నిద్రపోయే ముందు తల్లి గమనించి కేకలు వేయగా చుట్టపక్కల అక్కడికి చేరుకొని కిందికి దించారు. కాగా..ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ జయన్న తెలిపారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 9, 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ సమావేశాన్ని రాబియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా మహాసభల్లో ఇళ్ల స్థలాలపై తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో సొంతిల్లు లేని నిరుపేదలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. కాగా, ఆగస్టు 9వ తేదీ భారీ ర్యాలీ, బహిరంగ సభలు ఉంటాయని, ఈ సభలకు రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. నాయకులు శ్రీనివాసరావు, మహేష్, నాగరాజు, వెంకటేశ్వరమ్మ, బువ్వమ్మ, శాంబీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



సామూహిక కుంకుమార్చనలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో మహా గౌరీ

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి దేవాలయంలోని మహాగౌరీ అమ్మవారు, సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో చౌడేశ్వరీ దేవి అమ్మవారికి, చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, లలితా పీఠం, నిమిషాంబ దేవి ఆలయం, అంబా భవానీ ఆలయం, లలితా పీఠం, రాజరాజేశ్వరీ దేవి ఆలయాల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజ, దుర్గ పూజ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' నాటక ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: తొగట వీర క్షత్రియ సేవా సంఘం, నందవరీక బ్రాహ్మణ సంఘం, దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' నాటకం అలరించింది. అమ్మవారి పుట్టుపూర్వోత్తరాలతో పాటు, అమ్మవారి మహిమలు, ఆరాధన తీరును ప్రొద్దుటూరు చౌడేశ్వరీ ఆర్ట్స్ కళాకారులు కంభంపాటి పామిలేటి దర్శకత్వంలో అద్భుతంగా ప్రదర్శించారు. అంతకుముందు చౌడేశ్వరీ మాత చిత్రపటానికి పూలమాల సమర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన నాటకంలోని కళాకారులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌడేశ్వరీ మాత వైభవాన్ని నాటక రూపంలో కర్నూలులో మొదటిసారి ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు చింతా శ్రీనివాసులు, తొగట వెంకటేశ్వర్లు, పోలిశెట్టి రాజ్‌కుమార్, నందవరీక బ్రాహ్మణ సంఘం నిర్వాహకులు సుదర్శన్‌రావు, సురేష్ దుర్గాప్రసాద్, విశ్వనాథ్ దేవాంగ సంఘం నాయకులు ప్రభాకర్, మదన్, కొండయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే జలమయం



సర్వీసు రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

కర్నూలు నగర శివారులోని మిస్టర్ ఇడ్లీ హోటల్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా నీటితో నిండిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మిస్టర్ ఇడ్లీ హోటల్, ఆర్టీసీ కాలనీ, రామచంద్ర నగర్, షరీన్ నగర్, మాంటిస్సోరి ఇండస్ స్కూల్, ఉర్దూ యూనివర్సిటీకి ప్రతి రోజూ వేలాది మంది ఇదే రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షపు నీటిలో లోతు అంచనా వేయలేక ద్విచక్రవాహనదారులు అనేకమంది అదుపు తప్పి గుంతలో పడి గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పెద్ద గుంతలను పూడ్చి సర్వీసు రోడ్డును బాగు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. – కర్నూలు (న్యూటౌన్)

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ సంపత్‌కుమార్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నిడ్జూరు గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ సంపత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామస్తులతో కలిసి కర్నూలు మండల విద్యుత్ కార్యాలయంలో ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. గ్రామంలో చాలా చోట్ల విద్యుత్ తీగలు అతుకులు వేశారన్నారు. వాటిని తొలగించి కొత్త విద్యుత్ తీగలతో లైన్ ఎర్పాటు చేయాలన్నారు. గ్రామంలో కొన్ని చోట్ల పాత విద్యుత్ స్తంభాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయలని కోరారు. ప్రధాన వీధిలో పాత స్తంభాలను తొలగించకుండానే కొత్తవి ఏర్పాటు చేశారని, పాతవి కూలిపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. గ్రామంలో వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని చెప్పారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఈ హామీ ఇచ్చారు.

డ్రామాలు కట్టిపెట్టి ఆడబిడ్డ నిధి ఇవ్వాలి

- చంద్రబాబు, అచ్చెన్నాయుడు ఆస్తులను అమ్మైనా ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాల్సిందే



మాట్లాడుతున్న నాగేంద్రమ్మ, వి.భారతి

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి పథకంపై డ్రామాలు కట్టిపెట్టి ఇచ్చిన హామీ మేరకు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇవ్వాలని ఏపీ మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రమ్మ, వి.భారతి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆడబిడ్డ నిధిపై బీరాలు పలికి ఇప్పుడు పథకాన్ని అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలని అనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట కోసం చంద్రబాబు, అచ్చెన్నాయుడు ఆస్తులను అమ్ముకొని పథకాన్ని అమలు చేయవచ్చని, అప్పుడు ఆంధ్రాను అమ్మాల్సిన పని ఉండదని చెప్పారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేసేందుకు కూటమి సర్కార్ పూనుకుందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగానే వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 ఇచ్చి మహిళలను ఆదుకున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, లేదంటే ఆయన్ను మహిళలు ఎప్పటికీ నమ్మరని చెప్పారు. కార్యక్రమంలో కోటమ్మ, సులోచనమ్మ, సుధా, ఆశాబేగం, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణపై ఆర్డీఓ విచారణ



స్థలాల ఆక్రమణపై విచారణ చేస్తున్న ఆర్డీఓ సందీప్

సి.బెళగల్: మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కర్నూలు ఆర్డీఓ సందీప్ విచారణ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి చేరుకున్న ఆయన ఆక్రమణ స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించిన ఆయన రోడ్డుపై ఉన్న బంకులను తొలగించాని, పాఠశాల వెనుక భాగంలో ఉన్న గుడిసెలను తొలగించి, ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి పరిస్థితిపై విచారించి, ఇళ్ల స్థలాలకు అర్హులైతే స్థలాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎస్ఎంసీ చైర్మన్ గోవిందు, వీఆర్వోలు రఫీ, తిమ్మన్న, రంగముని, వీఆర్ఏలు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆర్డీఓ, అధికారులు

సి.బెళగల్‌లో ఆక్రమణలపై విచారణకు వచ్చిన ఆర్డీఓ సందీప్, మండల అధికారులతో కలిసి క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత, స్వామివారి విశిష్టతను, కొండపై జరిగే పూజా కార్యక్రమాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మ, ఆర్ఐ తరుణ్, ఎంఈఓ ఆదామ్‌బాష, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్ తదితరులు ఉన్నారు.